## ముఖ్యమంత్రి కేసీఆరే సింగరేణికి రక్ష

- ఆయనతోనే కొత్త ఉద్యోగాలు.. హక్కులు
- మంచిర్యాల నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లయ్య
- శ్రీరాంపూర్‌లో ఇంటింటా ప్రచారం



ఆర్కే-7 గనిపై మాట్లాడుతున్న మంచిర్యాల నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే దివాకర్‌రావు, చిత్రంలో టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య

శ్రీరాంపూర్, నవంబర్ 11 : సీఎం కేసీఆర్ సింగరేణి రక్ష అని, ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకున్నారని, కొత్త ఉద్యోగాలు, హక్కులు కల్పించారని మంచిర్యాల నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే నడిపెల్లి దివార్‌రావు, టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ఆర్కే-7గనిపై శనివారం ఏరియా ఉపాధ్యక్షుడు సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికులపై సీఎం కేసీఆర్‌కు మక్కువ అని తెలిపారు. కారుణ్య ఉద్యోగాలు అమలు చేయడం వల్ల నేడు సింగరేణిలో 16 వేల మంది యువకులకు ఉద్యోగాలు దొరికాయన్నారు. నోటిఫికేషన్ల ద్వారా కూడా 4 వేల ఉద్యోగాలు కల్పించినట్లు చెప్పారు. ఆయన ఉన్నంత వరకు సింగరేణిని ప్రైవేటుపరం కాకుండా అడ్డుకుంటారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వల్లే కార్మికులకు అన్ని విధాలా ఆర్థిక ప్రయోజనాలు కలుగుతున్నాయని చెప్పారు. కార్మికులు కారు గుర్తుకు ఓటు వేసి, హ్యాట్రిక్ సీఎంగా నిలబెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడు అన్నయ్య, కేంద్ర చర్చల ప్రతినిధి ఏనుగు రవీందర్‌రెడ్డి, ఏరియా చర్చల ప్రతినిధులు వెంగళ కుమారస్వామి, కాశీరావు, పెట్టం లక్ష్మణ్, బ్రాంచ్ కార్యదర్శి పానుగంటి సత్తయ్య, కానగంటి చంద్రయ్య, పిట్ కార్యదర్శి మెండ వెంకటి, ఏరియా ఆర్గనైజింగ్ కార్యదర్శులు తొంగల రమేశ్, జగదీశ్వర్‌రెడ్డి, నాయకులు చేర్యాల, మహిపాల్‌రెడ్డి, సిద్ధం తిరుపతి పాల్గొన్నారు.

### ఇంటింటా ప్రచారం..

శ్రీరాంపూర్ ఏరియా 16వ వార్డు హిమ్మత్‌నగర్, గాంధీనగర్, సుందరయ్యనగర్, ఆర్కే-6 గుడిసెల్లో ఇంటింటా వార్డు ఇన్‌చార్జి గుంట జగ్గయ్య ఆధ్వర్యంలో నస్పూర్ చైర్మన్ ప్రభాకర్, బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే దివాకర్‌రావు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. శ్రీరాంపూర్, నస్పూర్ ఏరియాలోని సింగరేణి స్థలాల్లో నివాసం ఉంటున్నవారికి పట్టాలు ఇచ్చామని, దీంతో కార్మికులు బంగ్లాలు కట్టుకొంటున్నారని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, కార్యదర్శి పవన్, మాజీ జడ్పీటీసీ తిప్పని రామయ్య, కౌన్సిలర్లు బెడిక లక్ష్మి, బొతు లక్ష్మీ, చీడం మహేశ్, మండల మహిళా అధ్యక్షురాలు రౌతు రజిత, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు గర్సె రామస్వామి, మాజీ సర్పంచ్ జక్కుల రాజేశం, రాజేంద్రపాణి, కమలాకర్‌రావు, వార్డు అధ్యక్షుడు ఎల్లయ్య, రఫీక్‌ఖాన్, చిలుముల నాగరాజు, పెర్క సత్తయ్య, స్వామి, శ్రీనివాస్, ఎర్రయ్య, బండి తిరుపతి, నోముల నరేందర్‌రెడ్డి, ప్రశాంత్ పాల్గొన్నారు.

## బాలింతలకు అందుతున్న సేవలపై ఆరా

వాంకిడి,నవంబర్ 11 : వాంకిడి మండలం నార్లాపూర్‌లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఆరోగ్యపరంగా అందుతున్న సేవలపై శనివారం ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్ పర్యవేక్షించారు. క్రమం తప్పకుండా పిల్లలకు టీకాలు ఇవ్వాలని, గర్భం దాల్చిన మొదలు అన్ని ప్రసవం పొందేవరకు విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం కృష్ణకుమారి, అంగన్‌వాడీ లక్ష్మి, ఆశకార్యకర్త వర్కర్ రోజా, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మురుగునీరు.. ఉపయోగపడేలా



### 11 ఏరియాల్లో విజయవంతంగా వ్యర్థాల శుద్ధి

- సింగరేణి వ్యాప్తంగా 22 ప్లాంట్లు
- శుద్ధిచేసిన నీరు పంటల సాగుకు తరలింపు
- వ్యర్థాలతో సేంద్రియ ఎరువు తయారీ.. రైతులకు ఉచితంగా పంపిణీ
- త్వరలో భూపాలపల్లి ఏరియాలో మరో రెండు అధునాతన ప్లాంట్లు

**సింగరేణి.. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతతోపాటు** పర్యావరణ పరిరక్షణకూ అధిక ప్రాధాన్యమిస్తున్నది. వాతావరణ సమతుల్యం దెబ్బతినకుండా అనేక కార్యక్రమాలు చేపడుతున్నది. తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేస్తూనే.. నీటి శుద్ధిపైనా దృష్టిపెట్టింది. ఇందులో భాగంగా కాలనీల్లోని మానవ వ్యర్థాలను శుద్ధిచేసి వివిధ అవసరాలకు ఉపయోగించేలా చర్యలు చేపట్టింది. సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లోని కాలనీల సెప్టిక్ ట్యాంక్‌లతో పాటు, స్నానాలు, బట్టలు ఉతికేందుకు ఉపయోగించిన నీటిని శుభ్రం చేస్తున్నది. ఈ క్రమంలో ఏర్పడే వ్యర్థాలను సేంద్రియ ఎరువులుగానూ రైతులకు ఉచితంగా అందిస్తున్నది. ఇప్పటికే 22 ఎస్టీపీ (సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)లు నిర్మించింది. కాగా, భూపాలపల్లిలోని రెండు కాలనీల్లో రూ.4 కోట్ల చొప్పున మొత్తం రూ.8 కోట్లతో నూతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఎస్టీపీలను ఏర్పాటుచేయనున్నది. - రామవరం, నవంబర్ 11



ఏరియేషన్ ట్యాంక్‌లో నీటి శుద్ధీకరణ

సింగరేణి వ్యాప్తంగా చాలా ఇండ్లలో ఇంకుడు గుంతలు లేకపోవడంతో ప్రజలు ఉపయోగించిన నీరు వృథాగా కాలువల ద్వారా వాగుల్లో చేరి, కలుషితమవుతున్నాయి. జీవరాసులకు ముప్పు వాటిల్లడమే కాకుండా తాగునీటి అవసరాలకు ఉపయోగిస్తే అనర్థాలూ ఎదురవుతున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని సింగరేణి యాజమాన్యం.. కాలనీల్లోని సెప్టిక్ ట్యాంక్‌లతో పాటు, స్నానాలు, బట్టలు ఉతికేందుకు ఉపయోగించిన నీటిని శుద్ధి చేసి, బయటికి పంపిస్తున్నది. ఇందుకు సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లో నీటి శుద్ధి కర్మాగారాలను ఏర్పాటు చేసింది. ఇందులో అన్ని ఏరియాలు, దవాఖానలను కలుపుకొని 22 ఎస్టీపీ(సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)ల ద్వారా ప్రక్రియ చేస్తున్నది. గౌతంపూర్ కాలనీలో 2010లో రూ.1.31కోట్లతో 1.5 ఎంఎల్‌డీ (మిలియన్ ల్యాక్స్ లీటర్ పర్‌డే) ఎస్టీపీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడి ఎస్టీపీలో శుద్ధిచేసిన నీటిని బయటికి పంపిస్తున్నారు. కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్ ఎర్రగడ్డ, గౌతంపూర్ కాలనీ, మిలీనియం, సీ2, 22 క్వార్టర్స్‌లోని మురుగునీటిని శుద్ధి చేస్తున్నారు. అనంతరం ఆ నీటిని కాలువల్లోకి వదులుతున్నారు. తద్వారా పర్యావరణ సమతుల్యం దెబ్బతినకుండా ఉపయోగపడుతున్నది. దీంతో వాగుల్లో ప్రవహించే నీటికి ముప్పు తొలగిపోయింది. అలాగే ఇతర అవసరాలకు కూడా ఆ నీటిని ఉపయోగిస్తున్నారు. గతంలో ఈ ప్రాంతంలో వ్యవసాయానికి అపరిశుభ్రమైన నీరు వాడడంతో పంటల దిగుబడి తగ్గడమే కాకుండా పనులు చేసే వాళ్లు కూడా అనారోగ్యానికి గురయ్యేవారు. దీంతో వ్యవసాయం మందగించింది. ఎస్టీపీ నిర్మాణం వల్ల శుద్ధి చేసిన నీటిని బయటికి పంపడం వల్ల వ్యవసాయ సాగు పెరిగి రైతులు హర్షంవ్యక్తం చేస్తున్నారు.

### ఎస్టీపీ పనితీరు..

కాలనీల నుంచి వచ్చే మురుగు నీటిని(సెప్టిక్ ట్యాంక్‌తో పాటు, స్నానాలు, బట్టలు ఉతికేందుకు ఉపయోగించిన) ముందుగా రా వాటర్ సంపునకు తరలిస్తారు. ఈ నీటిని 7.5 హెచ్‌పీ మోటర్‌తో మురుగునీటిని ఏరియేషన్ ట్యాంకులోకి మళ్లిస్తారు. ఇక్కడ 15 హెచ్‌పీ సామర్థ్యం గల మోటర్‌తో నీటిని చిలుకుతారు. అనంతరం ఏరియేషన్ ట్యాంక్-2లోకి పంపించి, అక్కడా చిలుకుతారు. ఆ తర్వాత క్లారిఫైర్ ట్యాంక్‌కు మళ్లించి, నెమ్మదిగా చిలుకుతారు. తద్వారా నీరు పైకి రావడమే కాకుండా స్లెడ్జ్ (మలం) కిందకు పోతుంది. మలాన్ని స్లడ్జ్ టాంకుకు మళ్లించి, శుద్ధి చేస్తారు. క్లారిఫైర్ ట్యాంకులో ఉన్న నీటిని ఇసుక పొందుపర్చిన బెడ్ ట్యాంకులకు తరలిస్తారు. అక్కడ ఇసుకపై మలం పేరుకొని, ఇసుక నుంచి శుద్ధి చేసిన నీరు వస్తుంది. ఆ నీటిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ట్యాంకులో నిల్వ చేస్తారు. ఇక్కడ ల్యాబ్‌లో 5 రకాల పరీక్షలు (పీహెచ్, టీఎస్ఎస్, టీడీఎస్, బీవోడీ, సీవోడీ) నిర్వహించి, వాటి ప్రమాణాలు సరిచూసుకొని బయట కాలువలోకి వదులుతారు.

### సేంద్రియ ఎరువుల కేంద్రంగా ఎస్టీపీ..

ఎస్టీపీలో ప్లాంటులోకి కాలనీ నుంచి వచ్చిన వ్యర్థాలను సేంద్రి ఎరువు ఏరియేషన్ ట్యాంక్, క్లారిఫైర్ ట్యాంకుల



క్లారిఫై ట్యాంక్ నుంచి బెడ్ ర్యాక్స్‌పైకి వదులుతున్న నీరు



ల్యాబ్‌లో నీటి పరీక్షలు చేస్తున్న ఉద్యోగి

ద్వారా వచ్చిన వ్యర్థాలను బెండ్‌ట్యాంక్స్(ఇసుక)లోకి వదలడం వల్ల నీరు ఇసుక ద్వారా శుద్ధి అయి బయటికి వెళ్తుంది. బెట్ ట్యాంక్స్‌పై పేరుకుపోయిన స్లెడ్జ్‌ను ఎండిన తరువాత ఇసుపై నుంచి తొలగించి, పక్కన పోసాతరు. దీనిని సేంద్రియ ఎరువుగా ఉపయోగిస్తారు. ఈ ప్రాంతంలోని రైతులకు ఉచితంగా అందజేస్తారు. అలాగే ప్లాంటులో వివిధ పండ్లు, పూల రకాల మొక్కలకు ఎరువుగా వాడుతారు.

### నీటి శుద్ధి కేంద్రాల పరిధిలోని కాలనీలు..

సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లో నీటి శుద్ధి కార్మాగారాలు ఏర్పాటు చేసింది. కొత్తగూడెం కార్పొరేషన్ నీటి శుద్ధి కేంద్రానికి ఏరియా ప్రధాన దవాఖాన, ఏరియా క్వార్టర్ల నుంచి.., కొత్తగూడెం కేంద్రానికి గౌతమ్‌పూర్, రుద్రంపూర్ కాలనీల నుంచి.., మణుగూరు కేంద్రానికి పీవీ కాలనీ నుంచి.., ఇల్లెందులోని కేంద్రానికి ఓల్డ్ కాలనీ, పోస్టాఫీస్, జేకే కాలనీ,, సింగరేణి కాలనీ, చెక్‌పోస్టు ప్రాంతాల నుంచి.., ఆర్జీ-1లోని కేంద్రానికి ఓల్డ్ జీడీకే-3 ఇన్‌క్లైన్, జీడీకే-3 ఇన్‌క్లైన్, ఏరియా దవాఖాన నుంచి.., ఆర్జీ-2లోని కేంద్రానికి మహాకవి పోతన కాలనీ నుంచి.., ఆర్జీ-3లోని కేంద్రానికి సెంటినరీ కాలనీ నుంచి.., భూపాలపల్లిలోని కేంద్రానికి కృష్ణ కాలనీ, సుభాష్‌కాలనీ, ఏరియా దవాఖాన.., బెల్లంపల్లిలోని కేంద్రానికి గోలేటి టౌన్‌షిప్ నుంచి.., శ్రీరాంపూర్‌లోని కేంద్రానికి నస్పూర్ కాలనీ నుంచి.., మందమర్రిలోని కేంద్రానికి ఏరియా దవాఖాన (రామకృష్ణాపూర్), ప్రతిమ కాలనీ, నాగార్జున కాలనీల నుంచి.., ఎస్టీపీలోని కేంద్రానికి సోమగూడెం, తదితర కాలనీల నుంచి మురుగునీరు వస్తుంది.

### సాగుకు ఉపయోగపడుతుంది..



గతంలో మురుగునీరు రావడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. పంట పనులు చేసేందుకు కూలీలు వచ్చేవారు కాదు. ఎస్టీపీ ఏర్పాటు తరువాత నీటిని శుద్ధిచేసి, పంటపొలాలకు వదులుతున్నారు. దీంతో గతంలో పడ్డ ఇబ్బందులు దూరమయ్యాయి. కాలువల ద్వారా వచ్చే నీటి కంటే శుద్ధిచేసిన నీరే ఎక్కువగా వస్తుంది. దీనికి ఏ రోజూ, ఏ సమయంలో నీటిని విడుదల చేస్తారో తెలియజేస్తే బాగుంటుంది. అలాగే పరీక్షా ప్రమాణాలను పూర్తిస్థాయిలో పాటిస్తే ఈ నీటిని పశువులకు తాగించేందుకు ఉపయోగపడుతుంది.

- మొగరం శివకుమార్, రైతు, రుద్రంపూర్

### దోమపోటు నివారణ..



గతంలో దోమకాటు తీవ్రత ఎక్కువగా ఉండి, పంటనష్టం జరిగేది. కానీ, ప్రస్తుతం శుద్ధి చేసిన నీటిని విడుదల చేస్తుండడంతో ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. దోమపోటు నివారణతో పంట దిగుబడి కూడా బాగా పెరిగింది. శుద్ధి చేసిన నీటిని విడుదల చేసే సమయంలో పీహెచ్‌ లెవల్‌ను మంచిగా పరీక్షిస్తే ఇంకా బాగుంటుంది. ఈ ఎస్‌టీపీలో ఉన్న సేంద్రియ ఎరువులను ఏ సమయంలో ఇస్తారో, దాన్ని ఏ విధంగా వాడాలో సమీప రైతులకు వివరిస్తే ఇంకా బాగుంటుంది. ఉచితంగా సేంద్రియ ఎరువు ఇవ్వడం హర్షించదగ్గ విషయం.

- కత్తుల రమేశ్, రుద్రంపూర్, యువ రైతు

### పర్యావరణ పరిరక్షణే ధ్యేయం..



సంస్థ సీఎండీ శ్రీధర్, డైరెక్టర్ల ఆదేశాల మేరకు సంస్థ పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా పనిచేస్తుంది. పర్యావరణ పరిరక్షణ, వాతావరణ సమతుల్యం దెబ్బతినకుండా అనేక కార్యక్రమాలు చేపడుతున్నది. అందులో భాగంగా కాలనీలోని మురుగునీటిని శుద్ధిచేసేందుకు 22 ఎస్టీపీ ప్లాంట్లను ఏర్పాటుచేసింది. అలాగే ఎస్టీపీల వల్ల ఉపాధి కూడా దొరుకుతుంది. భూపాలపల్లి ప్రాంతంలో రెండు కాలనీల్లో ఒక్కో ఎస్టీపీకి రూ.4 కోట్ల వ్యయంతో మొత్తం రూ.8 కోట్లతో నూతన సాంకేతిక పరిజ్ఞానంతో ఎస్టీపీలను ఏర్పాటుచేస్తున్నాం.

- టీ సూర్యనారాయణ, సివిల్ జనరల్ మేనేజర్